
నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777



రంగారెడ్డి శుక్రవారం 17-04-2026 సంపుటి: 01 సంచిక : 301 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Friday, 17-04-2026 Volume :01 Issue: 301 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani


## తెలంగాణలో పెట్టుబడులు
# పెట్టండి

ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి

- ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేడిన్ తెలంగాణ' మార్క్
- అమెరికా పెట్టుబడిదారులకు తెలయి చేయండి
- అమెరికన్ నేషనల్ వార్ కాలేజీ బృందంతో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,

తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో గురువారం మంత్రి సమావేశమయ్యారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

-మిగతా 2 లో





## ఇజ్రాయెల్, లెబనాన్
# మధ్య సీజ్‌ఫైర్..

- 10 రోజుల పాటు కాల్పుల విరమణ
- ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- దీనితో కలిపి 10 యుద్ధాలు తానే ఆపానని వెల్లడి

వాషింగ్టన్,

ఇజ్రాయెల్, లెబనాన్ దేశాలు 10 రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం వెల్లడించారు. గత కొన్ని వారాలుగా రెండు దేశాల సరిహద్దుల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్న క్రమంలో ఇది అరుదైన దౌత్య పురోగతిగా ఆయన అభివర్ణించారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో, ఇటు లెబనాన్ అధ్యక్షుడు జోసఫ్ ఆన్‌తో అద్భుతమైన సంభాషణలు జరిగినట్లు ట్రంప్ తెలిపారు. 'కాల్పుల విరమణ 5 పీఎం ఈఎస్‌టీ (3.30 ఏఎం, ఐఎస్‌టీ)కి ప్రారంభమవుతుంది' అని ఆయన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా 9 యుద్ధాలను పరిష్కరించడం నాకు దక్కిన గౌరవం. ఇది 10వది. దీనిని కూడా విజయవంతం చేద్దాం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్, లెబనాన్‌కు చెందిన ప్రతినిధులు ఈ వారం మొదట్లో వాషింగ్టన్‌లో

-మిగతా 2 లో



## దక్షిణాది నేతలతో భారీ
# బహిరంగ సభ

- డీలిమిటేషన్‌పై సీఎం
- ఈనెలాఖరులో హైదరాబాద్‌లో నిర్వహణ

హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అసంబద్ధమైన నియోజకవర్గాల పునర్ విభజన, డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తూ దక్షిణాది రాష్ట్రాల గొంతుకను వినిపించాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయా రాష్ట్రాల నేతలతో ఈనెలాఖరులో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభకు ఆ పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టాలంటూ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

-మిగతా 2 లో

# ఇండియా,పాకిస్తాన్‌లా ఆంధ్రప్రదేశ్ విభజన



- తెలంగాణ, ఏపీ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు
- ప్రతిపక్ష ఎంపీల మండిపాటు
- క్షమాపణ చెప్పాలని డిమాండ్

2 లో

# పునర్విభజనపై భగ్గుమన్న తమిళనాడు

- బిల్లు ప్రతులను తగులబెట్టిన ముఖ్యమంత్రి స్టాలిన్
- రాష్ట్రమంతటా బ్లాక్ డే పేరుతో నిరసనలు
- నల్లజెండాలు ఎగురవేసిన సిపిఎం నాయకులు

చెన్నరు

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టి డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టిన రోజే తమిళనాడు అంతటా నిరసనలు హోరెత్తాయి. గురువారం నాడు రాష్ట్ర ప్రజానీకమంతా ఒక్కతాటిపైకి వచ్చి 'బ్లాక్ డే' పేరిట నిరసన ప్రదర్శనలు చేపట్టారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ డీలిమిటేషన్ బిల్లు ప్రతులను తగులబెట్టి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఒంటెద్దు పోకడలను సహించబోమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా నమ్మక్కల్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఇదొక నల్ల చట్టమని,

-మిగతా 2 లో





# తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

- వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే
- దీనిపై బిజెపి ఎంపిలు నోరు మెదపరా
- జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు

హైదరాబాద్,

తెలంగాణ ఉద్యమాన్ని ఇండియా–పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య.. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే నీకు అంత చులకనా? ఎంత ధైర్యం ఉంటే ఇక్కడి పోరాటాన్ని అంతలా కించపరుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల వివక్షకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం చేసిన ఈ

-మిగతా 2 లో

## మహిళా బిల్లుతో
# చరిత్ర సృష్టిద్దాం

### ఇందులో ఎలాంటి రాజకీయం లేదు

- 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు
- వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత
- చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
- ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
- ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
- దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు
- ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తేవద్దు
- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు
- మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

న్యూఢిల్లీ

మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక

-మిగతా 2 లో







## పక్కా ప్లాన్ ప్రకారమే
# సమావేశాలు

- లోక్‌సభ సీట్లు పెంచడంపైనే మీ దృష్టి
- మహిళా రిజర్వేషన్లను ఎవ్వరూ వ్యతిరేకించడం లేదు
- చాణుక్యుడు బతికుంటే మీ కుయుక్తికి ఆశ్చర్య పోయేవాడు
- లోక్‌సభలో ప్రియాంక సెటైర్లు...అమిత్‌షా నవ్వులు

న్యూఢిల్లీ,

కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎంపీ ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ...చాణుక్యుడు కూడా ఇంత పక్కాగా ప్లాన్ చేసి ఉండలేదని అన్నారు. మహిళా కోటా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, అయితే దీనిని అమలు చేయడానికి డీలిమిటేషన్ చేస్తుండటంపైనే తమ అభ్యంతరాలు ఉన్నాయని లోక్‌సభలో ఆమె అన్నారు. ఎన్నికల్లో పైచేయి సాధించడానికి ఇది ఒక రాజకీయ అస్త్రం అని ఆమె ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని దెబ్బతీయడానికి బీజేపీ తన పార్టీ పునాదులను బలోపేతం చేసుకుంటోందని ఆమె అన్నారు. ఇదిలా ఉంటే,

-మిగతా 2 లో

## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు
# హైకోర్టు నోటీసులు



2 లో



# టీవీకే మ్యానిఫెస్టో విడుదల

- పేదింటి అమ్మాయి పెండ్లికి 8 గ్రాముల బంగారం
- మహిళలకు నెలకు రూ. 2,500
- అన్నదాతలకు రుణ మాఫీ

చెన్నై:

త్వరలో జరుగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టీవీకే అధినేత విజయ్ తమ పార్టీ మ్యానిఫెస్టోను గురువారం విడుదల చేశారు. పేదింటి అమ్మాయి పెండ్లికి 8 గ్రాముల బంగారం, నాణ్యమైన పట్టుచీర అందజేస్తామని హామీ ఇచ్చారు. 60 ఏండ్లలోపు మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. 5 ఎకరాల్లోపు రైతులకు పంట రుణాలు మాఫీ, క్వింటా ధాన్యంపై రూ.3,500 కనీస మద్దతు ధర చెల్లింపు, స్వయం సహాయక సంఘాలకు రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, యువతకు రూ.4 వేలు నిరుద్యోగ భృతి, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి హామీలు మ్యానిఫెస్టోలో ప్రకటించారు.

## తెలంగాణలో 17 నుంచి
# 26కు ఎంపీల సంఖ్య

### ఏపీలో 25 నుంచి 38కి పెరుగుదల



- డీలిమిటేషన్‌పై హోంమంత్రి అమిత్ షా వెల్లడి
- దక్షిణాదికి అన్యాయం జరగదని వివరణ

న్యూఢిల్లీ,

డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారంగా తిప్పికొట్టారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు,

-మిగతా 2 లో

# స్వదేశీ యాంటీషిప్ మిస్సైల్‌ను పరీక్షించిన పాక్ నేవీ



2

## తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

మొదటి తరువాయి

మహోద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కూడా తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలతో అవమానించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సరే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా మీ పార్టీ ఎంపీ మాట్లాడుతుంటే.. మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే, ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు.మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్ర ప్రభుత్వ పెద్ద కుట్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి, డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆమె విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లుపై ఢిల్లీ వేదికగా కవిత మాట్లాడుతూ.. 'మహిళ బిల్లుకు డీలిమిటేషన్ బిల్లును లింక్ చేయటం పెద్ద కుట్ర. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణకు రాజకీయ ప్రాధాన్యం తగ్గిస్తే ఊరుకునేది లేదు. ఒకవేళ డీలిమిటేషన్ పేరుతో తెలంగాణ సీట్ల సంఖ్యను తగ్గిస్తే, రాష్ట్ర ప్రయోజనాల కోసం మరో ఉద్యమం తప్పదు. మహిళా రిజర్వేషన్లలో కచ్చితంగా బీసీ సబ్ కోటా ఉండాలి. అప్పుడే వెనుకబడిన వర్గాల మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం దక్కుతుంది' అని అన్నారు.

## పక్కా ప్లాన్ ప్రకారమే సమావేశాలు

మొదటి తరువాయి

చాణక్యుడిని ప్రస్తావిస్తూ ఆమె వేసిన సెటైర్లు సభలో నవ్వులు పూయించాయి. కేంద్రం హోం మంత్రి అమిత్ షా కూడా ప్రియాంకా వ్యాఖ్యలకు నవ్వారు. మీరంతా పక్కా ప్లాన్‌తో వచ్చారు. ఈ రోజు గనుక చాణక్యుడు బతికి ఉంటే మీ కుయుక్తికి ఆయన ఆశ్చర్యపోయి ఉండేవారని ఆమె అన్నారు. రాష్ట్ర ఎన్నికల సమయంలో హఠాత్తుగా పార్లమెంట్ ఏర్పాటు చేయడం, ఎన్నికలకు ఒక రోజు ముందే ముసాయిదా ముందుకు తేవడం, మహిళా అభ్యున్నతి కోసం మోడీ అతిపెద్ద నిర్ణయం తీసుకున్నారని మీడియాలో చర్చ జరిపించడం, ప్రతీ ఒక్కరూ ఆయనకు మద్దతు ఇచ్చేలా చేయడం, ఇలా ప్రతిపక్షాలను సందిగ్ధంలో పడేయడం అంతా ప్లాన్ అంటూ ఆమె ఆరోపించారు. ఈ వ్యాఖ్యలుకే అమిత్ షాతో పాటు మంత్రులు కిరెన్ రిజిజు నవ్వారు. అంతకముందు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని తప్పుపట్టిన ఆమె.. అందులో జవహర్‌లాల్ నెహ్రూ పేరు వినిపించకపోవడం గమనార్హం అని అన్నారు. మహిళల హక్కుల పట్ల బీజేపీ నేతలే ఛాంపియన్లుగా భావిస్తున్నారని ఆమె విమర్శించారు. మోదీ ప్రసంగంలో నెహ్రూ పేరు వినిపించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. రిజర్వేషన్లపై 2018లోనే ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ లేఖ రాశారు. 2019లోపే రిజర్వేషన్లు అమలు చేయాలని రాహుల్ కోరారు. ప్రధాని మోదీ సగం సమాచారం మాత్రమే వెల్లడించారు. ఇవాళ ప్రధానంగా రిజర్వేషన్ల కోటాపై చర్చ కాదు.. లోక్‌సభ సీట్లను 850కి పెంచడంపైనే. మోదీ ప్రభుత్వం లోక్‌సభ సీట్ల పెంపుపైనే ఆసక్తి కనబరుస్తోంది. ఆ విషయంలో ప్రభుత్వానికి అంత తొందరెందుకని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లను ఎవరూ వ్యతిరేకించలేదు. రాహుల్ స్వయంగా మోదీ దగ్గరకు వెళ్లి మరీ మద్దతు తెలిపారు. ఆ బిల్లుపై క్రెడిట్‌ను మోదీ.. కాంగ్రెస్‌కు ఇవ్వలేదు. దేశ మహిళలకు కాంగ్రెస్ ఎంతో సేవ చేసింది. బిల్లు విషయంలో మహిళలను బీజేపీ తప్పుదోవ పట్టిస్తోంది. మహిళా బిల్లును ఎవరు వ్యతిరేకిస్తున్నారో మోదీ చెప్పాలి. కులగణనకు మోదీ ఎందుకు భయపడుతున్నారు? ఓబీసీలకు న్యాయం జరగాలి.. వారి హక్కులను ఎవరూ కాలరాయలేరు' అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.

## తెలంగాణలో 17 నుంచి 26కు ఎంపీల సంఖ్య

మొదటి తరువాయి

తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. జనాభా గణన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని , ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, జనాభా గణన జరిగినప్పుడు కుల గణన కూడా చేర్చుతామని ఆయన చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను అమిత్ షా తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన చెప్పారు. రాజ్యాంగంలో అలాంటి అవకాశం లేదన్నారు. అఖిలేష్ యాదవ్ డిమాండ్లపై విమర్శలు చేస్తూ.. అఖిలేష్ యాదవ్ తన పార్టీ టికెట్లన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వొచ్చని, ఆయన పార్టీకి ఎలాంటి సమస్యల ఉండదని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు.

## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

**-మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం..**
**-విచారణ జూన్ 6కు వాయిదా**



హైదరాబాద్
పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన కేసులో ఫిరాయింపుదారులుగా చెబు తున్న వాళ్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఫిరాయింపుదారులు కాదంటూ స్పీకర్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలంటూ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులో తెలిపింది. ఆ తర్వాత కౌంటర్లు దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశిం చింది. విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది. బీఆర్ఎస్ తరఫున ఎంపికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్, కడియం, శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, యాదయ్య, కృష్ణమోహన్ రెడ్డి, టి.ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకటరావు, సంజరుకుమార్, గూడెం మహిపాల్‌రెడ్డిలపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ నిరాకరిస్తూ తీర్పు చెప్పారు. ఈ తీర్పులను సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.జగదీశ్‌రెడ్డి, కె.పి.వివేకానంద, కె.సంజరు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీహెచ్.ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు వేశారు. వీటిని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.

## పునర్విభజనపై భగ్గుమన్న తమిళనాడు

మొదటి తరువాయి

పెద్ద కుట్ర అని విమర్శించారు. విస్తృత సంప్రదింపులతో ఏకాభిప్రాయాన్ని సాధించిన తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉత్తరాది రాష్ట్రాలను, దక్షిణాది రాష్ట్రాలను వేరు చేసి అన్యాయం చేయాలని చూస్తే సహించబోమన్నారు. సమాఖ్య స్ఫూర్తిని నీరుగార్చే ఏ ప్రయత్నాన్ని సాగనివ్వమని ఆయన హెచ్చరించారు. 'తమినాడు నిరసిస్తుంది, తమిళనాడు విజయం సాధిస్తుంది' అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆది ద్రవిడ సంక్షేమ శాఖ మంత్రి మతివెంతన్, ఎంపీ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం నమ్మక్కల్‌లో వున్న ముఖ్యమంత్రి తర్వాత డిఎంకె అభ్యర్థి రాణి తరఫున ప్రచారం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంట్లోనూ, బహిరంగ ప్రదేశాల్లో నల్ల జెండాలు ఎగురవేసి ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు.

## మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

మొదటి తరువాయి

సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోగపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు.మహిళా రిజర్వేషన్ ప్రక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.


## ఇండియా,పాకిస్తాన్‌లా ఆంధ్రప్రదేశ్ విభజన

**–తెలంగాణ, ఏపీ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు**
**-- ప్రతిపక్ష ఎంపీల మండిపాటు**
**-- క్షమాపణ చెప్పాలని డిమాండ్**



న్యూఢిల్లీ
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గురువారం లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపు సవరణ బిల్లులపై చర్చలో భాగంగా రాష్ట్ర విభజనను తప్పుబట్టేలా విమర్శలు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చారు. " బ్రిటీషర్స్ కంటే చెత్తగా తెలుగు రాష్ట్రాన్ని కాంగ్రెస్ విభజించింది. ఆనాడు ఇండియా–పాకిస్తాన్ విభజన మాదిరిగా తెలంగాణ, ఏపీని విభజించారు. విభజన సమయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరుతో ఇప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావారణం నెలకొంది' అని ఆయన విమర్శించారు. అలాగే డీలిమిటేషన్‌పై ప్రతి పక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని తేజస్వీ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్, తదితర బిల్లులను ఎలాగైనా అడ్డు కోవాలని, ప్రతిపక్షాలు కొత్తదారులు వెతుకుతు న్నాయని మండిపడ్డారు. ఈ సందర్భంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించిన హైబ్రీడ్ ఫార్ములాపై తేజస్వీ సభలో ప్రస్తావిం చారు. ఆ ప్రతిపాదనను ఆయన కొట్టిపారేశారు. సీట్ల సంఖ్య ఆధారంగా జీడీపీకి ముడిపెట్టాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సలహా అత్యంత తెలివి తక్కువైనదని అన్నారు. అలాంటి ప్రతిపాదనతో ముందుకెళితే ఒక వ్యక్తి, ఒక ఓటు అన్న రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రానికి విలువే ఉండదన్నారు. రాష్ట్రాల ఆదాయం ఏటా మారుతూ ఉంటుందని, దానిని డీలిమిటేషన్ ప్రతిపాదికన తీసుకోవడం సరికాదని చెప్పారు. ఆదాయం ప్రకారం ఓట్లు ఇవ్వాలని అనుకుంటే.. దేశంలో అత్యంత ఆదాయనం ఉన్న అంబానీ లక్ష ఓట్లు ఇవ్వాల్సి వస్తుందని సెటైర్లు వేశారు.

## స్వదేశీ యాంటీషిప్ మిస్సైల్‌ను పరీక్షించిన పాక్ నేవీ



**కరాచీ:**
స్వదేశీయంగా అభివృద్ధి చేసిన యాంటీషిప్ మిస్సైల్‌ను ఇవాళ పాకిస్థాన్ నేవీ విజయవంతంగా పరీక్షించింది. చాలా దూరంలో ఉన్న టార్గెట్లను ఆ మిస్సైల్ చేరుకోగలదని పాక్ మిలిటరీ పేర్కొన్నది. నౌకల నుంచి లాంచ్ చేసే ఆ యాంటీషిప్ మిస్సైల్‌ను నేవీ విజయవంతంగా పరీక్షించినట్లు ఐఎస్పీఆర్ ప్రకటించింది. నేవీ చీఫ్ అడ్మిరల్ నవీద్ అష్రఫ్‌తో పాటు ఇతర శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు మిస్సైల్ ఫైరింగ్ ఈవెంట్‌ను వీక్షించారు. అత్యాధునిక గైడెన్స్ సిస్టమ్‌తో పాటు అడ్వాన్స్‌డ్ మాన్యువరబులిటీ ఉన్నట్లు పేర్కొన్నారు. శత్రువుల క్షిపణుల నుంచి తప్పించుకునే సామర్థ్యం ఉన్నట్లు ప్రకటనలో తెలిపారు. పరిస్థితులకు తగినట్లు డైనమిక్‌గా మారుతుందని, చాలా కచ్చితత్వంతో ఆ క్షిపణి ప్రాణాంతకంగా మారుతుందని మిలిటరీ పేర్కొన్నది. ప్రాంతీయ సముద్ర భద్రత, స్థిరత్వం నేపథ్యంలో మిస్సైల్ ఫైరింగ్ ఈవెంట్ నిర్వహించినట్లు చెప్పారు. అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్, సీడీఎఫ్ అసిమ్ మునీర్ తాజా పరీక్ష పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

మొదటి తరువాయి

అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్డ్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024–26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ÷నాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు.

## ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య సీజ్‌ఫైర్..

మొదటి తరువాయి

సమావేశమయ్యారని, ఇలా ఇద్దరూ సమావేశం కావడం 34 ఏండ్లలో ఇదే తొలిసారని ఆయన చెప్పారు. ఈ చర్చల్లో యూఎస్ విదేశాంగ మంత్రి రూబియో కూడా పాల్గొన్నారని ట్రంప్ వెల్లడించారు.

**తెలివైన నిర్ణయం తీసుకోండి.. లేకపోతే..**

శాంతి ఒప్పందానికి ఒప్పుకోకపోతే అనంతర పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇరాన్‌ను అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మరోసారి హెచ్చరించారు. 'ఇరాన్ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడి చేయడానికి అమెరికా సిద్ధంగా ఉంది.' అని పేర్కొన్నారు. 'ఇరాన్ కనుక తెలివితక్కువ నిర్ణయం తీసుకుంటే దాని మౌలిక సదుపాయాలు, విద్యుత్తు, ఇంధన రంగాలపై దిగ్బంధనం, బాంబుల వర్షం కురుస్తుంది' అని హెగ్సెత్ తెలిపారు. 'మీకు చెప్పేదేమిటంటే.. మేము మిమ్మల్ని గమనిస్తున్నాం. మీరు ఏ మిలిటరీ ఆస్తులను తరలిస్తున్నారో మాకు తెలుసు' అని అన్నారు. తాము మునుపటి కన్నా పూర్తి శక్తిమంతంగా, సన్నద్ధతతో వస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ కనుక శాంతి ఒప్పందానికి సుముఖత చూపకపోతే తాము అనుకున్నంత కాలం హొర్ముజ్ జలసంధిని దిగ్బంధించగలమని ఆయన హెచ్చరించారు.

## దక్షిణాది నేతలతో భారీ బహిరంగ సభ

మొదటి తరువాయి

డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టాన్ని వివరిస్తూ ముఖ్యమంత్రి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు సీఎంలకు లేఖలు రాసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో బహిరంగ సభకు రావాలంటూ వారికి వర్తమానం పంపాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఇదే అంశంపై చర్చించి, కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలను తిరస్కరిస్తూ కార్యాచరణ చేపట్టేందుకు వీలుగా ఆయన ఏఐసీసీ పెద్దలతో సమాలోచనలు జరిపారు. ఇందుకోసం బుధవారం ఢిల్లీ వెళ్లిన సీఎం... గురువారం వరకూ అక్కడే ఉండనున్నారు. కాగా గత పార్లమెంటు ఎన్నికల సమయంలో బీజేపీ, ఆరెస్సెస్‌నుద్దేశించి సీఎం చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. కమలం పార్టీకి పార్లమెంటులో ఎక్కువ సీట్లు కట్టబెడితే అది రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తుందని, రిజర్వేషన్లను ఎత్తేస్తుందని ఆయన హెచ్చరించారు. అదే తరహాలో ఇప్పుడు డీలిమిటేషన్ అంశాన్ని తీవ్ర స్థాయిలో చర్చనీయాంశం చేయాలని సీఎం భావిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దీనికి తెలంగాణ నాయకత్వం వహిస్తే... ఇటు ప్రభుత్వానికి, అటు పార్టీకి ఉపయుక్తంగా ఉంటుందనేది ఆయన వ్యూహంగా కనడడుతున్నది. అందువల్లే వీలైనంత త్వరగా కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ)ని నిర్వహించి, ఆ సమావేశంలో కార్యాచరణ ప్రకటించాలని పీసీసీ చీఫ్‌నకు సీఎం సూచించారు. డీలిమిటేషన్‌పై గతేడాది మార్చిలో తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన చెన్నైలో దక్షిణాది రాష్ట్రాల సమావేశాన్ని నిర్వహించిన విషయం విదితమే.

RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక

# మిడ్జిల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడికి అభినందనలు వెల్లువ








మిడ్జిల్ సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ఎడ్ల శంకర్ ముదిరాజ్



మావిళ్ళ మమత మన్యం (మిడ్జిల్ గ్రామ ఉపసర్పంచ్)

**మిడ్జిల్, ఏప్రిల్ 16 (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మిడ్జిల్ గ్రామ ఉప సర్పంచ్ మావిళ్ళ మమత మన్యం మాట్లాడుతూ, అధ్యక్షుడిగా ఎన్నికైన నాయకుడు మండలంలోని సర్పంచుల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ, గ్రామాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రాథమిక వసతుల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచుల సంఘం కీలక పాత్ర పోషించాలని ఆమె పేర్కొన్నారు. కొత్త అధ్యక్షుడి నాయకత్వంలో సర్పంచుల సంఘం మరింత చురుకుదనంతో పనిచేస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు బరిగెల రమేష్, వద్దే సరిత కృష్ణలు కూడా అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధికి సర్పంచుల సంఘం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజలకు చేరువగా ఉండే విధంగా సమస్యలను పరిష్కరించడంలో సంఘం ముందుండాలని ఆకాంక్షించారు. అలాగే స్థానిక సంస్థల బలోపేతం, పారదర్శక పరిపాలన, అభివృద్ధి పనుల వేగవంతం వంటి అంశాలలో అధ్యక్షుడు మార్గదర్శకత్వం అందించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకత్వంపై పూర్తి నమ్మకం వ్యక్తం చేస్తూ, ఆయనకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు

## సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎడ్ల శంకర్ ముదిరాజ్ ఏకగ్రీవ ఎన్నిక



మిడ్జిల్ మండల్ సర్పంచుల సంఘం అధ్యక్షుడు. ఎడ్ల శంకర్ ముదిరాజ్

**మిడ్జిల్ ఏప్రిల్ 16 (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా మిడ్జిల్ గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్ ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల సర్పంచులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. అనంతరం సర్పంచుల సంఘం కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సంఘం ఉపాధ్యక్షులుగా మహిన్ షేక్ జహంగీర్, బొల్గం నాగరాజు, కోశాధికారులుగా సువర్ణమ్మ, ప్రధాన కార్యదర్శులుగా రాములు, శ్రీశైలం యాదవ్ ఎన్నికయ్యారు. కార్యదర్శి సభ్యులుగా రాజునాయక్, మణి శంకర్, గౌరవ సభ్యులుగా అంజన్ రెడ్డి, మాధురి మల్లేష్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సుజాత, మంగమ్మ, వెంకట్ రాములు, శశికళ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడ్ల శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న సర్పంచులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# సంక్షేమ,అభివృద్ధి పథకాలపై అవగాహనకు మండల స్థాయి సమావేశాలు

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్దిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామాలలో రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలి
- వచ్చే ఏడాది నాటికి సంపూర్ణ క్షయ రహిత జిల్లాగా చేద్దాం
- గ్రామాల్లో గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 16(నేటి దర్శిని బ్యూరో):** ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడానికి గ్రామ, మండల స్థాయి సమావేశాలను నిర్వహిస్తున్నామని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. గురువారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోందని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ దశల ప్రకారం ప్రతి వారం బిల్లులు సమయానికి చెల్లిస్తున్నామని చెప్పారు. ఎక్కడా బిల్లులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి, ఇందిరానగర్, గుంటూరుపల్లి గ్రామాలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో 100% ప్రగతి సాధించాయని అభినందించారు. మిగతా గ్రామాలు కూడా అదే విధంగా ముందుకు సాగాలని సూచించారు. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న చిన్న సమస్యలను సర్పంచులు పరిష్కరించాలని, పంచాయతీల ద్వారా సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో 100% విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అవసరమైతే ఖాళీ గదులు ఉన్న పాఠశాలలకు తరలించాలని అన్నారు. విలేజ్ న్యూట్రిషన్ డే సందర్భంగా గర్భిణీలు, చిన్నారులు, రక్తహీనత సమస్యలు, పోషకాహార లోపం వంటి అంశాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా, ఏఎన్ఎం సిబ్బంది కృషితో జిల్లాలో టిబి కేసులు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఎల్కతుర్తిని టిబి రహిత మండలంగా కొనసాగిస్తూ, వచ్చే సంవత్సరం జిల్లాను టిబి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు గ్రామాల్లో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించాలని అన్నారు. గంజాయి వ్యాప్తి గ్రామాల వరకూ చేరిందని ఆందోళన వ్యక్తం చేస్తూ, సమష్టిగా దాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరిగితే వెంటనే నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం అంగన్వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులకు దుస్తులను కలెక్టర్ పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుకినే సంతాజీ, సర్పంచ్ లావణ్య, జడ్పీ సీఈవో శేషాద్రి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, డీపీవో లక్ష్మీ రమాకాంత్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్, డీఈవో గిరిరాజ్ గౌడ్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, ఏడీఏ ఆదిరెడ్డి, ఎంపీడీవో విజయ్ కుమార్, తహసీల్దార్ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలే మన ఇళ్లకు దేశానికి అసలైన బలం..

- మున్సిపల్ వైస్ చైర్మన్ గీతా చారి....



**ఆమనగల్లు,ఏప్రిల్ 16(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్లు మున్సిపల్ వైస్ చైర్మన్ తల్లోజు గీతా చారి మాట్లాడుతూ 2014 లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడినప్పటి నుంచి దేశంలో నిజమైన మార్పు మొదలైంది. ఉజ్వల యోజనతో వంట గదిలో భద్రత, స్వచ్ఛభారత్ తో ఆత్మగౌరవం, పీఎం ఆవాస్ యోజనతో సొంతింటి హక్కు,ఇలా ప్రతి అడుగులోనూ మహిళలకు ఒక స్పష్టమైన గుర్తింపు లభించింది. నేడు మహిళలు ఇంటికే పరిమితం కాకుండా వ్యాపార రంగాల్లో రాణిస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. గతంలో కంటే ఉన్నతమైన కలలు కంటున్నారు. ఇప్పుడు "నారీ శక్తి వన్దన్ అదినీయం" ద్వారా కల్పించిన 33% రిజర్వేషన్ తో మహిళలు కేవలం చర్చలకే పరిమితం కాకుండా చట్టసభల్లో నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదిగారు. మహిళల ప్రయాణాన్ని ఆత్మగౌరవం నుంచి ఆర్థిక స్వాతంత్రం వైపు,అక్కడి నుంచి నాయకత్వం వైపు నడిపిస్తున్న నరేంద్ర మోడీ కి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలను వైస్ చైర్మన్ గీతా చారి తెలియజేశారు.

## ఆమనగల్లు మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుని ఎన్నిక......

- అధ్యక్షునిగా రామ్నుంతల సర్పంచ్ వి.శ్రీను నాయక్......



**ఆమనగల్లు,ఏప్రిల్ 16(నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్లు మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులంతా కలిసి గురువారం సర్పంచ్ ల సంఘం అధ్యక్షున్ని ఎన్నుకున్నారు. ఆమనగల్లు మండల సర్పంచుల సంఘం అధ్యక్షునిగా రామ్నుంతల సర్పంచ్ వద్యావత్ శ్రీను నాయక్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.మౌనిక మంగళపల్లి సర్పంచ్,టి.జంగమ్మ శెట్టిపల్లి సర్పంచ్,ప్రధాన కార్యదర్శిగా నేలపట్ల నరేందర్ రెడ్డి ఆకుతోటపల్లి సర్పంచ్, కోశాధికారిగా సత్యం సింగంపల్లి సర్పంచ్, కార్యదర్శిగా వెంకటయ్య పోలేపల్లి సర్పంచ్,మిగతా సభ్యులుగా మండ్లి రాములు శంకర్ కొండ తండా సర్పంచ్, వి రాజేశ్వరి మేడిగడ్డ సర్పంచ్, పి ప్రశాంతి చెన్నంపల్లి సర్పంచ్,శ్రీలత కోనాపూర్ సర్పంచ్,పత్యా నాయక్ కొత్త కుంట తండా సర్పంచ్,కె యాదయ్య చింతలపల్లి సర్పంచ్,సరిత సీతారాం నగర్ తండా సర్పంచ్,వీరిని అందరూ కలిసి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆమనగల్లు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత రత్న పురస్కారంతో భీమ్ ఆర్మీ సీనియర్ నాయకుడు మిర్యాల వెంకట్ కు సత్కారం




**హైదరాబాద్, ఏప్రిల్ 16 (నేటి దర్శిని):** హైదరాబాద్ అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న భీమ్ ఆర్మీ లాల్భారత్ ఏక్తా మిషన్ అగ్రనేత శ్రీ మిర్యాల వెంకట్ కి ప్రతిష్టాత్మక 'దళిత రత్న పురస్కారం లభించింది. గత కొన్నేళ్లుగా దళిత హక్కుల పరిరక్షణే లక్ష్యంగా, బాధితులకు అండగా నిలుస్తూ, బహుజన సమాజంపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్న మిర్యాల వెంకట్ సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఈ గౌరవాన్ని ప్రదానం చేసింది డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో, ఉత్సవ కమిటీ కో-చైర్మన్ శ్రీ అల్లి బిల్లి మహేందర్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేయబడింది.

ఈ సందర్భంగా మిర్యాల వెంకట్ మాట్లాడుతూ, ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, బాబాసాహెబ్ ఆశయ సాధన కోసం తన పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ పురస్కారం కేవలం వ్యక్తిగత గౌరవమే కాకుండా బహుజన సమాజం సాధించిన విజయంగా భావిస్తున్నారు.

## సంపాదకీయం

# పెరుగుతున్న పూర్ణమ్మలు



పుస్తకాలు పట్టాల్సిన చిట్టితల్లులు బాల్యంలోనే పెళ్లి పీటలెక్కుతున్నారు. అన్నెంపున్నెం ఎరుగని ఆ పుత్తడిబొమ్మల మెడలో పుస్తెలతాడు ఉరితాడులా మారి ఉచ్చు బిగిస్తోంది. తెలిసీ తెలియని వయసులో పట్టుమని పదహారేండ్లు కూడా నిండని ముక్కుపచ్చలారని ఆ పసిమొగ్గలు కుటుంబ బరువు, బాధ్యతల బందీఖానాలో చిక్కి శల్యమైపోతున్నారు. పెండ్లంటే ఏమిటో తెలియకుండానే చిన్నారులు అగాథంలో కూరుకుపోతున్నారు. మోయలేని పేదరికం ఆడపిల్ల భారం తీరుతుందని కన్నోళ్లే సంసారం అనే సాగరంలోకి నెట్టేస్తున్నారు. బాల్యవివాహాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాలు, పేద కుటుంబాల్లోనే జరుగుతున్నాయి. చిన్న వయసులోనే గర్భం దాల్చి అనారోగ్యం బారిన పడి ఎన్నో జీవితాలు ఆహుతి అవుతున్నాయి. తెలంగాణలో బాల్య వివాహాల విషయంలో ఆందోళనకర పరిస్థితి కనిపిస్తోందని సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చెబుతోంది. రాష్ట్రంలో సుమారు ఐదు శాతం అమ్మాయిలు... అంటే సుమారు 2.16 లక్షల మంది బాలికలకు 18 ఏండ్ల లోపే పెండ్లి చేస్తున్నారని సర్వేలో గుర్తించారు. చట్టపరమైన నిషేధం ఉన్నప్పటికీ.. సామాజి కంగా ఇంకా కొనసాగుతున్న సమస్యగా కనిపిస్తోంది. అభివృద్ధికి కేవలం ఆర్థిక ప్రమాణా లనే కాకుండా.. మహిళల స్థితిని కూడా సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని ఈ పరిణామాలను చూస్తే అర్థమవుతోంది. ఆర్థిక ఇబ్బందులు, త్వరగా పెళ్లిచేసి బాధ్యతలు తీర్చుకోవాలనే భావనతో చిన్నారులను చదువుకోవాలన్న ఆకాంక్షల నుంచి దూరం చేస్తున్నారు. తెలంగాణ మహిళల్లో సుమారు 65.5శాతం మంది పదోతరగతి దాటి చదవలేకపోతున్నారు. అంటే రాష్ట్రంలోని ప్రతి ముగ్గురు మహిళల్లో ఇద్దరు కనీసవిద్యను కూడా పూర్తి చేయడం లేదు. ఇది మహిళల అభివృద్ధి, సామాజిక పురోగతికి పెద్ద అడ్డంకిగా మారుతోంది. ప్రత్యేకంగా గిరిజన వర్గాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. బాల్యవివాహాలపై క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా తల్లిదండ్రులు ఈ సామాజిక దురాచారం నుంచి బయటపడలేక పోతున్నారు. రోజుకు మూడు చొప్పున కేసులు మన రాష్ట్రంలోనే నమోదవు తున్నాయి. బాల్య వివాహాల నిరోధక చట్టం, చైల్డ్‌లైన్‌పై అవగాహనతో ఎవరై నా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తేనే ఈ కేసులు వెలుగులోకి వస్తున్నాయి. గుట్టు చప్పుడు కాకుండా జరుగు తున్న బాల్య వివాహాలకు లెక్కేలేకుండా పోతోంది. "మేలిమి బంగరు మెలతల్లారా.. కలువల కన్నుల కన్నెల్లారా.. తల్లులగన్నా పిల్లల్లారా.. విన్నా రమ్మా ఈ కథను.." అంటూ గురజాడ అప్పారావు బాల్యవివాహపు ఉక్కుకోరల్లో చిక్కు కుని బలైపోయిన బాలిక గురించి రాసిన దీనగాథ "పుత్తడిబొమ్మ పూర్ణమ్మ" కథ. ఆ పూర్ణమ్మల కథలు నేటికీ కొనసాగుతుండటం అత్యంత విషాదం. రాజధాని పరిసర ప్రాంతాలు సైతం అభివృద్ధిలోనే కాదు.. సామాజిక వెనుకబాటులోనూ ముందుండటం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసినా అది నిష్టుర సత్యం. గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరగడానికి కారణం అవిద్య, అవగాహనా లేమి కారణాలుగా కనిపిస్తున్నాయి. సమాజాన్ని ఆవరించిన అభద్రతా భావం కూడా ఆడపిల్లలకు శాపంగా మారింది. పిల్లలకు సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగడానికి, అభివృద్ధి చెందటానికి రక్షణ పొందే హక్కును రాజ్యాంగం కల్పించింది. బాల్య వివాహం వారి హక్కులను హరిస్తుంది. ఆడపిల్లలు అంతరిక్షంలోకి వెళ్తున్న నేటికాలంలో కూడా ఇప్పటికీ దేశంలో బాల్య వివాహాలు జరగడానికి కారణాలేమిటి? కేవలం అభివృద్ధిలోనే కాకుండా ప్రజల ఆలోచనల్లోనూ వెనుకబాటుతనం స్పష్టంగా కనిపిస్తోంది. సమాజం ఎప్పుడో వదిలేసిన అమా నుష ఆచారాలు కొనసాగుతున్నంత కాలం ఎన్ని చట్టాలు వచ్చినా నిరూపయోగమే. నేడు హిందూత్వ ఎజెండాను బలంగా అమలు చేస్తున్న మనువాదుల పాలనలో ఉన్నాం. పాలకగణం చట్టాలను అమలు చేయడం కంటే ప్రజలను అశాస్త్రీయత వైపు నడిపించడానికే ప్రాధాన్యత ఇస్తున్నది. దాని ఫలితం చట్ట విరుద్ధమని తెలిసినా ఇప్పటికీ బాల్య వివాహాలు ఆగడంలేదు. దీని కారణంగా రానున్న దశాబ్దంలో కోట్లాది మంది బాలికలు బాల్య వివాహాల ఊబిలో కూరుకుపోయే ప్రమాదంఉందని యునిసెఫ్ హెచ్చరించింది. ఏదిఏమైనా బాల్యవివాహాల దురాచారం సమర్థనీయం కాదు. దీన్ని అరికట్టినప్పుడే యువతులకు వ్యక్తిగత స్వేచ్ఛ, ఎంపికలకు అవకాశం ఉంటుంది. తద్వారా మహిళా సాధికారతకు మేలైన బాట పడుతుంది. దేశం పురోగతి సాధిస్తున్న క్రమంలో మహిళలకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వస్తుండ టంపై చైతన్యం కల్పించడం ద్వారా బాల్యవివాహాలను నిరోధించాలి. ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప ఈ బాల్య వివాహాల్ని అడ్డుకోవడం కష్టం.

# ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఢీకొన్న రెండు విమానాలు

### -తృటిలో తప్పిన పెనుప్రమాదం



**న్యూఢిల్లీ ఏప్రిల్ 16 (నేటి దర్శిని)**
దేశ రాజధాని ఢిల్లీ లోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సాయంత్రం రెండు విమానాలు పరస్పరం ఢీకొన్నాయి. విమానాలు ఒకదానికొకటి స్వల్పంగా ఢీకొనడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఆ విమానాలు ఏమాత్రం వేగంగా ఢీకొన్నా భారీగా ప్రాణనష్టం జరిగేది. ట్యాక్సీ వేపై ఆకాశ ఎయిర్ , స్పైస్‌జెట్ కు చెందిన రెండు విమానాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.విమానాశ్రయ వర్గాలు వెల్లడించిన సమాచారం ప్రకారం.. స్పైస్‌జెట్‌కు చెందిన బోయింగ్ బీ737-700 విమానం ట్యాక్సీయింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో హైదరాబాద్‌కు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న ఆకాశ ఎయిర్ విమానం అక్కడ నిలిపి ఉంది. వేగంగా వస్తున్న స్పైస్‌జెట్ విమానం కుడి రెక్క నిలిపి ఉన్న ఆకాశ విమానం తోక భాగంలోని స్టెబిలైజర్‌ను తాకింది. దాంతో రెండు విమానాల భాగాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై ఆకాశ ఎయిర్ వెంటనే స్పందించింది. తమ విమానం ఆగి ఉన్నప్పుడు మరో విమానం వచ్చి ఢీకొట్టినట్లు ప్రాథమికంగా తెలిసిందని సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు, సిబ్బంది అందరినీ సురక్షితంగా విమానం నుంచి దించామని, హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. కాగా దెబ్బతిన్న రెండు విమానాలను అధికారులు పరిశీలన కోసం బేకు తరలించారు. ఈ ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విచారణ జరిపే అవకాశం ఉంది.

## లష్కరే వ్యవస్థాపక సభ్యుడు

# ఆమిర్ హమ్‌జాపై కాల్పులు



**ఇస్లామాబాద్:న్యూఢిల్లీ ఏప్రిల్ 16 (నేటి దర్శిని)**
పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా వ్యవస్థాపక సభ్యుడు ఆమిర్ హమ్‌జాపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ ఘటన లాహోర్‌లో జరిగింది. ప్రస్తుతం అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. ఉగ్రవాది హాఫీజ్ సయిద్‌తో కలిసి 1985లో లష్కరే తోయిబాను హమ్‌జా స్థాపించారు. ఇండియాలో జరిగిన అనేక ఉగ్రవాద కార్యకలాపాలకు అతనికి లింకులు ఉన్నాయి. హాఫీజ్ సయీద్ తర్వాత హమ్‌జా లష్కరే గ్రూపులో రెండో కీలక వ్యక్తిగా ఎదిగారు. హమ్‌జాను ఉగ్రవాదిగా అమెరికా ముద్రవేసింది. లాహోర్‌లో ఉన్న ఓ న్యూస్ ఛానల్ ఆఫీసు ఆవరణలో అతనిపై కాల్పులు జరిపారు. 1959లో ఆమిర్ హమ్‌జా జన్మించారు. అతను మాజీ ఆఫ్ఘన్ ముజాయిదిన్. లష్కరే ఐడియాలజీలో కీలక వ్యక్తి అతను. అతని వయసు 66 ఏళ్లు. చాలా ధాటిగా అతను మాట్లాడగలడు, రాయగలడు. టెర్రర్ గ్రూపుకు చెందిన ఓ పబ్లికేషన్‌ను అతను ఎడిట్ చేస్తాడు. అనేక పుస్తకాలు రాశాడతను. ఖాఫిలా దావత్, షాహదత్ బుక్స్ అతనే రాశాడు. 2018 నుంచి లష్కరేతో హమ్‌జా దూరంగా ఉంటున్నాడు. లష్కరే ఫండింగ్ పై ప్రభుత్వం నిఘా పెట్టడంతో అతను తన కార్యకలాపాలను తగ్గించుకున్నాడు. ఆ తర్వాత అతను జైషే మన్‌కాఫా సంస్థను స్థాపించాడు. దాని ద్వారా లష్కరే కోసం ఫండ్స్ సేకరించాడు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాల కోసం ఆ డబ్బును వాడేవాడు.

## యూరప్ దగ్గర ఆరు వారాలకు

# సరిపడ మాత్రమే జెట్ ఫ్యూయెల్ నిల్వలు..


### వెల్లడించిన ఐఈఏ చీఫ్



**న్యూఢిల్లీ ఏప్రిల్ 16 (నేటి దర్శిని)**
ఇరాన్-అమెరికా యుద్ధం ప్రపంచ దేశాలను ఆందోళనలో నెట్టింది. అగ్రదేశాలుగా వెలుగొందుతున్న యూరప్ దేశాలు కూడా ఈ యుద్ధ ప్రభావంతో చమురు సమస్యను ఎదుర్కొంటున్నాయి. తాజా అంచనా ప్రకారం.. యూరప్ దగ్గర ఆరు వారాలకు సరిపడా మాత్రమే విమాన ఇంధనం నిల్వలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఐఈఏ (ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ) చీఫ్ ఫాతి బిరోల్ వెల్లడించారు.ఇరాన్ యుద్ధ సంక్షోభం ఇంకొన్ని రోజులు కొనసాగితే, యూరప్ ఏవియేషన్ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆయన అన్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధిని అమెరికా మూసేసిన సంగతి తెలిసిందే. దీంతో యూరప్‌నకు చమురు రవాణా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో చమురు అంశంపై ఫాతి బిరోల్.. మీడియా సంస్థలతో మాట్లాడారు. ఈ పరిస్థితి ఇంకొన్ని రోజులు ఇలాగే కొనసాగితే ఇంధన కొరత కారణంగా విమానాల ప్రయాణాలు రద్దయ్యే పరిస్థితి ఉందన్నారు. "హోర్ముజ్ జలసంధి తిరిగి తెరవకపోతే విమాన ఇంధన కొరత తలెత్తి, విమానాల రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఇంధన సంక్షోభం ఎదురుకాలేదు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర సంక్షోభం ఎదురుకానుంది. హోర్ముజ్ జలసంధి ఎక్కువ కాలం అందుబాటులోకి రాకపోతే ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధారపడే ఆసియా దేశాలపైనే ఎక్కువ ప్రభావం పడుతుంది. దక్షిణ కొరియా, ఇండియా, చైనా, బంగ్లాదేశ్ ముందుగా నష్టపోతాయి. తర్వాత యూరప్‌పై ప్రభావం ఉంటుంది" అని బిరోల్ అన్నారు. ఇప్పటికే అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

# శాంతి చర్చలు విఫలమైతే మళ్లీ యుద్ధం తప్పదు

### ఇరాన్‌కు అమెరికా హెచ్చరిక



**న్యూఢిల్లీ ఏప్రిల్ 16 (నేటి దర్శిని)**
అమెరికా, ఇరాన్ మధ్య రెండో దశ శాంతి చర్చలు జరగబోతున్న సంగతి తెలిసిందే. పాకిస్తాన్ వేదికగా రెండో దశ శాంతి చర్చలు జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు అమెరికా తాజాగా మరో హెచ్చరిక జారీ చేసింది. ఈసారి శాంతి చర్చలు విఫలమైతే యుద్ధం చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని హెచ్చరించారు. యుద్ధాన్ని తిరిగి ప్రారంభిస్తామని, ఇందుకు సిద్ధమవుతున్నామని అమెరికా రక్షణ శాఖ సెక్రెటరీ పీట్ హెగ్సెత్ అన్నారు. ఇరాన్ ప్రతి కదలికనూ గమనిస్తున్నామని పేర్కొన్నారు.'అమెరికా నిఘా సంస్థలు ఇరాన్ ప్రతి కదలికనూ గమనిస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్ సైనిక చర్యలపై నిఘా ఉంది. ప్రస్తుతం కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ అమెరికా దళాలు యుద్ధానికి సిద్ధంగా ఉన్నాయి. గతంలోకంటే ఇప్పుడు యుద్ధానికి ఇంకా బలంగా సిద్ధమవుతున్నాం. మేం ఎనర్జీ సెక్టార్‌ను ఇంకా ధ్వంసం చేయలేదు. హోర్ముజ్ దిగ్బంధనంతో ఎగుమతులు నిలిచిపోయాయి. త్వరగా అమెరికాతో ఇరాన్ ఒప్పందం కుదుర్చుకుంటుందని ఆశిస్తున్నాం. శాంతి చర్చలు విఫలమైతే తిరిగి యుద్ధం తప్పదు. ఏ క్షణమైనా యుద్ధానికి సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం హోర్ముజ్ వద్ద ట్రాఫిక్‌ను అమెరికన్ నేవీ నియంత్రిస్తోంది. ఇజ్రాయెల్ దాడుల తర్వాత ఇరాన్‌కు నౌకాదళమే లేదు" అని పీట్ హెగ్సెత్ వ్యాఖ్యానించారు. అయితే, అమెరికా హెచ్చరికల్ని ఇరాన్ తేలికగా తీసుకుంది. తాము కూడా హోర్ముజ్ జలసంధిని దాటి దాడి చేయగలమని హెచ్చరించింది. గల్ఫ్ తీరంలోని రెడ్ సీ, ఒమన్ సీ పరిధిని అడ్డుకోగలమని హెచ్చరించింది. ఇరాన్-అమెరికా మధ్య రెండో దశ చర్చల కోసం ప్రపంచం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. పాకిస్తాన్ వేదికగా ఈ చర్చలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఈ అంశంలో ఇరాన్ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

# ఆకాశ విమానాన్ని ఢీకొన్న స్పైస్ జెట్.. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఘటన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (నేటి దర్శిని)**
దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెను ప్రమాదం తప్పింది. గురువారం ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరేందుకు సిద్ధమవుతున్న ఆకాశ ఎయిర్ విమానాన్ని, అదే సమయంలో పార్కింగ్ వైపు ప్రయాణిస్తున్న స్పైస్‌జెట్ విమానం తాకుతూ వెళ్లింది. ఈ ఘటనలో స్పైస్‌జెట్ విమానం కుడి వైపు వింగ్లెట్ దెబ్బతినగా, ఆకాశ ఎయిర్ విమానం ఎడుమవైపు భాగం స్వల్పంగా దెబ్బతిన్నదివెంటనే స్పందించిన విమానాశ్రయ అధికారులు, ఆకాశ ఎయిర్ విమానంలోని ప్రయాణికులు, ఇతర సిబ్బందిని కిందికి దింపారు.



ప్రయాణికులను హైదరాబాద్‌కు పంపేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు 'ఆకాశ ఎయిర్' అధికార ప్రతినిధి తెలిపారు. ఈ ప్రమాదంలో అందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై డీజీసీఏ తీవ్రంగా స్పందించింది. ఎక్కడ లోపం జరిగిందనే అంశంపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టామని డీజీసీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాద కారణంగా రెండు విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు.

# Arrive Alive కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ బి. శివధర్ రెడ్డి, ఐపిఎస్

- హెల్మెట్లు, మెడికల్ కిట్లు, డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీతో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం
- ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీతో పాటు రోడ్డు భద్రతా చర్యలకు ప్రజల విశేష స్పందన
- జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానికి, ఐపిఎస్.







**మిడ్జిల్, ఏప్రిల్ 16, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యచరణలో ఈరోజు తెలంగాణ రాష్ట్ర గౌరవ శ్రీ బి.శివధర్ రెడ్డి, ఐపీఎస్, డీజీపీ గారు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో నిర్వహించిన Arrive Alive రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ గారి ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది.కార్యక్రమంలో భాగంగా మొదటగా బాలానగర్ మండలం పెద్దాయపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి--44 కూడలిలో బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన ప్రదేశంలో హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం గౌరవ డీజీపీ గారి చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గౌరవ శాసనసభ్యులు శ్రీ జనంపల్లి అనిరుద్ రెడ్డి గారి తరపున నిర్వహించారు.అనంతరం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌ను డీజీపీ గారు సందర్శించి గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరించారు. తదుపరి జడ్చర్ల పట్టణంలోని చంద్ర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన కార్యక్రమంలో సుమారు 3000 మంది విద్యార్థులు, డ్రైవర్లు మరియు ప్రజలు పాల్గొన్నారు.మోదటగా జడ్చర్ల మెడికల్ అసోసియేషన్ తరపున పంపిణీ చేసిన మెడికల్ కిట్లను ఆటో డ్రైవర్లకు గౌరవ డీజీపీ శ్రీ బి.శివధర్ రెడ్డి, ఐపీఎస్ గారి చేతుల మీదుగా అందించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్స అందించేందుకు ఈ మెడికల్ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి ప్రాణాలను కాపాడే బాధ్యతతో వ్యవహరించాలని ఈ సందర్భంగా సూచించారు."హెటెరో ల్యాబ్స్ (జడ్చర్ల) డైరెక్టర్ ఫార్ములేషన్స్ డా.పి.ఆర్.భాస్కర్ రెడ్డి గారు తమ జూ= నిధుల నుండి 500 టీ-షర్టులను మరియు 100 హెల్మెట్లను సామాజిక సేవలో భాగంగా విరాళంగా అంధించి, హెటెరో సంస్థ ప్రతినిధి మరియు అడ్మిన్ హెడ్ అయిన శ్రీ డి.ఫణి రాజ కిరణ్ గారు నేటి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ని డీజీపీ గారు సందర్శించి, డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ, హెల్మెట్ల పంపిణీ మరియు డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ కార్యక్రమాలను ప్రారంభించారు.
కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ గారు స్వాగత ఉపన్యాసం అందిస్తూ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం పోలీస్ శాఖ ముఖ్య బాధ్యతగా తీసుకొని "హాతీతీఅజవ హాశ్రీఅజవ" కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అర్రైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా గత ఏడాది జనవరి నుండి ఏప్రిల్ మధ్య జరిగిన యాక్సిడెంట్లతో పోల్చుకుంటే 2026 జనవరి నుండి ఏప్రిల్ వరకు 20% యాక్సిడెంట్లు తగ్గాయి అని, ప్రజలు రోడ్డు నియమాలను తప్పనిసరిగా అనునిత్యం పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులు తమ అనుభవాలను పంచుకుంటూ, ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఒక చిన్నారి విద్యార్థి రోడ్డు భద్రతపై ప్రసంగించడం జరిగింది.
అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీమతి కుష్బూ గుప్తా, ఐఏఎస్ గారు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని సూచించారు.
తదుపరి జోగులాంబ జోన్--VII డీఐజీ శ్రీ ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్ గారు మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది కేవలం పోలీస్ శాఖ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.
అనంతరం గౌరవ ఎమ్మెల్యే శ్రీ అనిరుద్ రెడ్డి గారు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న "Arrive Alive' కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం అవసరమని, అందరూ హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.
డీజీపీ గారి చేతుల మీదుగా 'Arrive Alive' లోగోతో కూడిన హెల్మెట్ స్టిక్కర్లు, కార్ స్టిక్కర్లు, భారీ వాహనాల కోసం స్టిక్కర్లు మరియు రోడ్డు భద్రత అవగాహన పాంప్లెట్లను ఆవిష్కరించడం జరిగింది.ఈ సంధర్భంగ డీజీపీ గారు మాట్లాడుతూ, రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు 'Arrive Alive' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వము, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించడం, మితిమీరిన వేగం, నిర్లక్ష్య ఓవర్‌టేకింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ప్రమాదకర అలవాట్లను నివారించాలని సూచించారు.చివరిగా డీజీపీ గారు అందరితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమములో పాల్గొన్న జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారు, జోగులాంబ జోన్ అఱఱ డిఐజి శ్రీ ఎల్.ఎస్.చౌహాన్, ఐపీఎస్ గారు జిల్లా కలెక్టర్ శ్రీమతి కుష్బూ గుప్తా ఐఏఎస్ గారు, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ శ్రీమతి వాణి గారు, ఆర్టీసీ ఆర్ఎం సంతోష్ కుమార్ గారు, జడ్చర్ల మున్సిపల్ చైర్పర్సన్ పుష్పలత గారు మరియు ఇతర అధికారులు డ్రైవర్లు విద్యార్థులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగినది.

## రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన

- వేం నరేందర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే నాగరాజు



**ఉమ్మడి వరంగల్ జిల్లా ఏప్రిల్ 16:-(నేటి దర్శిని):**
తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై నేడు ఢిల్లీ పార్లమెంట్ రాజ్యసభ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డి ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఎంపీలు, ఎమ్మెల్సీలు సహచర ఎమ్మెల్యేలతో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆశయాల సాధనలో రాజ్యసభ సభ్యునిగా ఆయన సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాభినందనలు తెలిపారు.ఎమ్మెల్యే నాగరాజు తో కలిసి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు కూడా వేం నరేందర్ రెడ్డి కి రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు వేం నరేందర్ రెడ్డి ఎన్నిక తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని, రాజ్యసభ వేదికగా రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## యువతకు జోష్ నింపిన సంసద్ ఖేల్ మహోత్సవ్ ముగింపు

- పార్లమెంట్ ఇంచార్జ్‌ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి

**మిడ్జిల్, ఏప్రిల్ 16, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండల కేంద్రంలో నిర్వహించిన సంసద్ ఖేల్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముచర్ల జనార్ధన్ రెడ్డి, రాజేశ్వర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి పాల్గొని క్రీడాకారులను ఉత్తేజపరిచారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...
క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందించే శక్తివంతమైన వేదిక అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసి, "ఖేలో ఇండియా" స్ఫూర్తితో జాతీయ స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఈ మహోత్సవం అందిస్తోందన్నారు.

**డ్రగ్స్‌కు దూరం-స్పోర్ట్స్‌కు చేరువ**

మండల స్థాయి నుంచి పార్లమెంటరీ స్థాయి వరకు నిర్వహించే ఈ పోటీలు పేద కుటుంబాల పిల్లలకు తమ ప్రతిభను నిరూపించుకునే అరుదైన అవకాశమని అన్నారు.

**డ్రగ్స్‌కు దూరం-స్పోర్ట్స్‌కు చేరువ**









క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా ఓటమిని అంగీకరించడం, జట్టుగా ముందుకు సాగడం వంటి విలువలను నేర్పుతాయని వివరించారు.

**డ్రగ్స్‌కు దూరం-స్పోర్ట్స్‌కు చేరువ**

'నో టు డ్రగ్స్... యెస్ టు స్పోర్ట్స్" నినాదంతో యువత శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.
రోజుకు కనీసం అరగంట వ్యాయామం చేయాలని "ఫిట్ ఇండియా" సందేశాన్ని అందించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్, పీడీ శంకర్ నాయక్, రాజశేఖర్, మండల ఉపాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు వాసుదేవ్, శేఖర్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఆంజనేయులు, కిషన్ మోర్చా మండల అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, దేవేందర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరుకు కొత్త అసెంబ్లీ?

- మారనున్న రంగారెడ్డి రాజకీయ సమీకరణాలు!
- పాత కోటలకు బీటలు!

**కొత్తూరు 16 ఏప్రిల్ నేటి దర్శిని ప్రతినిధి ప్రతినిధి**
రంగారెడ్డి జిల్లాలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోనున్నాయనే సంకేతాలు స్పష్టమవుతున్నాయి.కేంద్ర స్థాయిలో చేపట్టబోయే డీలిమిటేషన్ ప్రక్రియతో జిల్లాలోని ప్రస్తుత నియోజకవర్గాల రూపురేఖలు తారుమారు కావడం ఖాయం అన్న అభిప్రాయం బలపడుతోంది.ముఖ్యంగా షాద్‌నగర్ పరిధిలో రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారబోతుందన్న చర్చ జోరందుకుంది.

**కొత్తూరు ఎంట్రీతో సమీకరణాలు తారుమారు**

జిల్లాలోని అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా ఎదిగిన కొత్తూరు... ఇప్పుడు రాజకీయంగా కూడా కీలక కేంద్రంగా అవతరించే సూచనలు కనిపిస్తున్నాయి. తాజా అంచనాల ప్రకారం కొత్తూరు ప్రత్యేక శాసనసభ నియోజకవర్గంగా రూపుదిద్దుకునే అవకాశం ఉందని సమాచారం.ఇది జరిగితే ప్రస్తుతం ఉన్న నాయకుల బలాబలాలు పూర్తిగా మారిపోవడం ఖాయం.

**మహేశ్వరం కుదేలవుతుందా?**

ప్రస్తుతం ప్రభావవంతమైన నియోజకవర్గంగా ఉన్న మహేశ్వరం నుంచి పలు గ్రామాలు వేరుచేసి కొత్తూరు నియోజకవర్గంలో విలీనం చేసే ప్రతిపాదన చర్చనీయాంశమైంది. అమీర్‌పేట్‌తో పాటు దాని పరిసర మండలాలు కొత్తూరు వైపు మళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇది మహేశ్వరం రాజకీయ సమీకరణాలను బలహీనపరుస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

**కొత్త నియోజకవర్గాల వరద**

జనాభా ప్రాతిపదికన జిల్లాలో మరిన్ని కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గచ్చిబౌలి, నార్సింగి, శంషాబాద్, మణికొండ, మియాపూర్




వంటి వేగంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు ప్రత్యేక నియోజకవర్గాలుగా మారే దిశగా చర్చలు జరుగుతున్నాయి. ఇది నగర పరిసర ప్రాంతాల్లో రాజకీయ పోటీని మరింత ఉత్కంఠభరితంగా మార్చనుంది.

**షాద్‌నగర్ రాజకీయాలకు షాక్**

ఇప్పటివరకు స్థిరంగా ఉన్న షాద్‌నగర్ రాజకీయాలు కూడా ఈ మార్పులతో కుదేలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓటర్ల సమీకరణాలు మారిపోవడం, కొత్త నాయకులకు అవకాశాలు రావడం, పాత నేతలు తమ స్థావరాలను కోల్పోవడం వంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

**ఎవరికి లాభం?ఎవరికి నష్టం?**

డీలిమిటేషన్ తర్వాత కొత్త నాయకులు రంగంలోకి రావడం ఖాయం. అయితే ప్రస్తుత శక్తివంతమైన నేతలకు ఇది పెద్ద సవాలుగా మారే అవకాశముంది. కొత్తూరు నియోజకవర్గం ఎవరికి వరమవుతుందో, ఎవరికి శాపమవుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తంగా... డీలిమిటేషన్ కేవలం సరిహద్దుల మార్పు కాదు... రంగారెడ్డి రాజకీయ భవిష్యత్తును తిరగరాయబోయే శక్తిగా మారుతోంది.

# జాఫర్‌గడ్‌లో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" ప్రారంభం





**16 ఏప్రిల్ నేటి దర్శిని:జాఫర్గడ్**
జాఫర్‌గడ్ మండల కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ విజయ్ కుమార్ గారు ముఖ్య అతిథిగా, వీణా సుమన్ గారి అధ్యక్షతన తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం కి వీ=ా శ్రీనివాస్ గారితో, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కుల్లా మోహన్ రావు గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కుల్లా మోహన్ రావ్ గారు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు అమలు కానుంది. ఆరు హామీలు, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో అందించడం, ప్రజా సమస్యలను నేరుగా పరిష్కరించడం దీని ముఖ్య ఉద్దేశ్యం."అభయహస్తం" ద్వారా ఆరు హామీలకు దరఖాస్తులు తీసుకొని అర్హులను ఎంపిక చేస్తారు. ఈ విధంగా అభివృద్ధిని వేగవంతం చేసి పాలనను ప్రజలకు దగ్గర చేయడమే ప్రభుత్వ లక్ష్యం.మన ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు వచ్చిన తర్వాత, అధికార వ్యవస్థనే మార్చేశారు. అధికారులు ఇప్పుడు కుర్చీల్లో కూర్చునే రోజులు పోయాయి -- - ప్రజల మధ్యకు రావాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతి సమస్యపై వెంటనే స్పందించాలి, ప్రతి పథకం నిజమైన లబ్ధిదారులకు చేరాలి అని కఠినంగా ఆదేశాలు ఇస్తున్నారు.

**ఇది మాటల ప్రభుత్వం కాదు -ఇది పని చేసే ప్రభుత్వం.**

మన గ్రామంలో కూడా అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుంది. రహదారులు, తాగునీరు, పింఛన్లు, రైతు సాయం---ఏ రంగంలో చూసినా అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. ఇది యాదృచ్ఛికం కాదు -- ఇది బలమైన నాయకత్వం, జవీ రేవంత్ రెడ్డి, MLA కడియం శ్రీహరి గారి వల్లే సాధ్యమైంది. ఇప్పుడు ప్రజల కాలం వచ్చింది. ఒకప్పుడిలాగ కాదు.

**ప్రజలు అడిగితే పని జరగాల్సిందే-ఇదే కొత్త పాలన విధానం.**

మనందరం ఈ అభివృద్ధి కార్యక్రమాలను మరింత బలపరచాలి. ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి పథకం గ్రామంలోని ప్రతి అర్హుడికి చేరేలా మనం కృషి చేయాలి అన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ సర్పంచ్లు, కార్యదర్శిలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వార్డు మెంబర్లు, అంగన్వాడీలు, ఆశ వర్కు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన..

**మందమర్రి 16 ఏప్రిల్ నేటి దర్శిని**
రహదారి భద్రతపై అవగాహన పెంచడం రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని నివారించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్ అవగాహన ర్యాలీ గురువారం మందమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి నిర్వహించామని సిఐ పర్స రమేష్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.మందమర్రి పోలీస్ స్టేషన్,ఎంఆర్ఓ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, ఇతర ప్రభుత్వకార్యాలయాలలో, పెట్రోలు బంకు లలో ఇకపై 'నో హెల్మెట్ - నో ఎంట్రీ' నిబంధనను కఠినంగా అమలు చేయనున్నట్లు




తెలిపారు.ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో తలకు గాయాలు కాకుండా ప్రాణాలు కాపాడుకోవచ్చని అన్నారు.ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రావాలని, లేనిపక్షంలో లోపలికి అనుమతించబోమని బోర్డులను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించే ముందు పోలీసు సిబ్బంది అందరూ విధిగా హెల్మెట్ ధరించి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.అరైవ్ అలైవ్ లక్ష్యం: 'సురక్షిత ప్రయాణం - సుఖమయ జీవితం' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించేలా చైతన్యపరచడమే ఈ ప్రచార ఉద్దేశమని సూచించారు.పోలీసులు హెల్మెట్లు ధరించి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించడం స్థానికుల దృష్టిని ఆకర్షించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్సై నరేష్ , పోలీస్ సిబ్బంది,స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# జీరో యాక్సిడెంట్ జోన్ గా జిల్లా తయారు కావాలి

- తల్లికి గర్భశోకం వెలకట్టలేదని
- కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం
- జిల్లా కలెక్టర్ ప్రాతిమా సింగ్

**మెదక్ 16 ఏప్రిల్ నేటి దర్శిని**
జీరో యాక్సిడెంట్ జోన్ గా మెదక్ జిల్లాను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో అరైవు-అలైవ్ కార్యక్రమంలో భాగంగా మెదక్ మండల కేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాల్ లో రోడ్డు ప్రమాదాల నివారణపై ద్విచక్ర వాహనదారులు, కారు డ్రైవింగ్ చేసేవారు హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం పై పోలీస్-రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.
ఈ సమావేశంలోనే హార్ట్ ఎటాక్ గురైన వారికి సిపిఆర్ ద్వారా ప్రాణదానం చేయవచ్చు అనే నినాదంతో సర్జన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ప్రత్యక్షంగా విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో జీరో యాక్సిడెంట్ జోన్ గా తీర్చిదిద్దాలని అన్నారు. పోలీస్ రవాణా శాఖ సమన్వయంతో నిర్వహించిన రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారులు హెల్మెట్ సీట్ బెల్ట్ పెట్టుకోవడం వల్ల జరిగే ప్రాణం నష్టాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా వివరించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం కృషిచేద్దామని అన్నారు.. మానవ తప్పిదాలవలనే ప్రమాదాలు అధిక సంఖ్యలో మన జిల్లాలో జరుగుతున్నాయని, విలువైన నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారు ప్రజలకు ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన



సమయాలలో తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స ఎలా చేయాలి, క్షతగాత్రులను సత్వరమే సమీప ఆసుపత్రికి తరలించడం వంటి వాటి పై అవగాహన కల్పించాలన్నారు.

**తల్లికి గర్భశోకం వెలకట్టలేదని**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నివేదికల ప్రకారం, అతివేగం, అజాగ్రత్త వల్ల తరచుగా మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రోడ్డు భద్రతా చర్యలను కఠినతరం చేసి ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడమే పోలీస్ శాఖ ప్రధాన కర్తవ్యం గా ముందుకు పోతున్నామన్నారు. మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ.. ప్రజల ప్రాణరక్షణ ధ్యేయంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అంటే రోడ్డు ప్రమాదాలపై మనకు కనువిప్పు కలగాలన్నారు. హెల్మెట్ సీట్ బెల్ట్ మన ప్రాణాలకు రక్షణ కవచంలా పని చేస్తాయన్నారు. చిన్న నిర్లక్ష్యం వలనే ప్రమాదాలు అధికంగా జరుగుతాయన్నారు. నేటి సమాజంలో యువత ఎక్కువగా ప్రమాదాలు బారిన పడుతున్నారని కుటుంబంలో కొడుకు ప్రమాదంలో చనిపోయినట్లయితే ఆ తల్లికి గర్భశోకం వెలకట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వాహనదారుడు కూడా నిబంధనలు తప్పనిసరి అన్నారు. ప్రయాణం ఎంత ముఖ్యమో గమ్యస్థానం చేరడం కూడా అంతే ముఖ్యం అని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై కవితల రూపంలో సభలో వినిపించారు.

**కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం**

మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరు బయటకు వెళ్లిన తర్వాత సురక్షితంగా ఇంటికి చేరుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు.
అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్పీ సిగ్నేచర్ క్యాంపెయిన్ లో పాల్గొన్నారు. వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. సురక్షిత ప్రయాణానికి కంటి చూపు ప్రధానం అని పోలీస్, రవాణా శాఖ సమన్వయంతో ఈ అరైవ్ - అలైవ్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున విజయవంతంగా కొనసాగుతూ, మంచిగా నిర్వహిస్తున్నారని అభినందించారు. వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని, వయసు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యలను గుర్తించి, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో,జిల్లా వైద్య అధికారి శ్రీరామ్,జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకట స్వామి, డి ఎస్పీ ప్రసన్న కుమార్,మున్సిపల్ చైర్మన్ కనుగుల రాధిక భూపతి రాజ్,వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,అధికారులు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ ఫారెస్ట్ లో పార్క్ పనుల పరిశీలన





**నారాయణఖేడ్,ఏప్రిల్ 16 (నేటి దర్శిని):**
నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని అర్బన్ ఫారెస్ట్ లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్క్ నిర్మాణ పనులను గురువారం ఉదయం మార్నింగ్ వాకింగ్ లో భాగంగా ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పరిశీలించారు.ఫారెస్ట్ లో వేసిన అంతర్గత రోడ్లపై తిరుగుతూ పరిశీలించారు.జరుగుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యం నుండి ఉపశమనం పొందేందుకు,పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన గాలి మరియు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో అర్బన్ పార్కును అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.పార్కులో వాకింగ్ ట్రాక్,పిల్లల ఆటస్థలాలు, పచ్చదనం పెంపొందించే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పట్టణ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయమం చేయడానికి, సేదతీరడానికి పార్కు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పార్కులో వివిధ రకాల మొక్కలను నాటి, పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా, పట్టణానికి ఒక కొత్త శోభను తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు.మున్సిపల్ పట్టణ ప్రజలకు మరియు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు ఈ పార్కులో వారి పిల్లలతో మరియు కుటుంబ సభ్యులతో గడపడానికి,సేద తీరడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది అన్నారు.ఈ కార్యక్రమంలో పండరి రెడ్డి,రామచందర్,బాణాపురం రాజు,గోపాల్ రెడ్డి,షారుఖాన్, మహేష్ చౌహన్, సుబుర్,గంగారెడ్డి, సంగ్రామ్,మహేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**నారాయణఖేడ్,ఏప్రిల్ 16 (నేటి దర్శిని):**
నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని పెద్ద శంకరంపేటకు చెందిన దాది గారి విజయలక్ష్మికి రూ. 60,000/-లు,అలీఖాన్ పల్లి గ్రామానికి చెందిన విశ్లావత్ చాశీర్లీబాయిలకు రూ, 20,500 ల ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను గురువారం ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ తన గృహంలో లబ్దిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్ ఆదేశాల మేరకు చెక్కులను పంపిణి చేయడం జరిగింది అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో మొయినొద్దీన్,శివ కుమార్,రషీద్, ఫయాజ్ తదితరులు ఉన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు నగదు నిత్యావసర వస్తువులు వితరణ...

**ఏటపాక: ఏప్రిల్ 16 (నేటి దర్శిని):**
మండల పరిధిలోని గొల్లగట్ట గ్రామం లో షార్ట్ సర్క్యూట్ వలన పూరి ఇల్లు దగ్ధం అయింది. అగ్ని ప్రమాద బాధితులకు లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాద్రి




జటాయువు చార్టర్ ప్రెసిడెంట్ నక్క వెంకన్న ఆధ్వర్యం లో నిత్యావసర సరుకులు బట్టలు నగదు వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో లైన్స్ క్లబ్ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# బిజినెస్

## మళ్లీ పెరిగిన గోల్డ్ రేట్



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు త్వరలో కుదుటపడతాయన్న అంచనాల నడుమ భారత్‌లో బంగారం ధరల్లో నేడూ పెరుగుదల కనిపిస్తోంది. త్వరలో యుద్ధం ముగుస్తుందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో కమోడిటీ మార్కెట్స్‌లో లోహాలకు డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఏప్రిల్ 16) ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర స్వల్పంగా పెరిగి రూ.1,55,570కు చేరింది. 22 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర కూడా కొద్దిగా ఎగబాకి రూ.1,42,600కు చేరుకుంది. కిలో వెండి ప్రస్తుతం రూ.2.75 లక్షల వద్ద కొనసాగుతోంది. విజయవాడలో ఇదే రేట్స్ కొనసాగుతున్నాయి.ఇతర ప్రధాన నగరాల్లో కూడా నేడు బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,660గా ఉంది. ముంబైలో రూ.1,55,570గా, ఢిల్లీలో రూ.1,55,720గా ఉంది. చెన్నైలో ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,43,600గా ముంబైలో రూ.1,42,600గా, ఢిల్లీలో రూ.1,42,750గా ఉంది. దేశంలో కిలో వెండి ధర రూ.2.75 లక్షల వద్ద తచ్చాడుతోంది. నిన్నటితో పోలిస్తే ధరలు స్థిరంగా ఉన్నాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ 24 క్యారెట్ల బంగారం 4,833 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## దుబాయ్ నుండి తెచ్చే బంగారం విషయంలో ఈ 7 తప్పులు అస్సలు చేయకండి!

ఈ సంవత్సరం అక్షయ తృతీయ ఏప్రిల్ 19న జరుపుకోనున్నారు. హిందూ మతంలో బంగారం, వెండి, ఇతర లోహాలను కొనుగోలు చేయడానికి ఈ రోజు అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. ప్రజలు అక్షయ తృతీయ అనే ఈ పవిత్రమైన సమయంలో బంగారం కొనుగోలు చేస్తారు. ఇటీవలి రోజుల్లో బంగారం ధరలు కూడా కొద్దిగా తగ్గాయి. చాలా మంది వివిధ దేశాల నుండి ముఖ్యంగా దుబాయ్ నుండి బంగారాన్ని దిగుమతి చేసుకుంటారు. దుబాయ్‌ను 'ప్రపంచ బంగారు నగరం' అని కూడా పిలుస్తారు. ఇక్కడ బంగారం నాణ్యత ఎక్కువగా ఉండటం, డిజైన్లు పుష్కలంగా లభించడం, భారతదేశం కంటే ధరలు చౌకగా ఉండటం వల్ల, ప్రజలు నలుమూలల నుండి ఇక్కడికి వచ్చి బంగారం కొనుగోలు చేస్తారు. మీరు దుబాయ్‌లో బంగారం కొనాలని ప్లాన్ చేస్తుంటే మీ అనుభవాన్ని సులభంగా, సురక్షితంగా చేసుకోవడానికి ఈ ఎనిమిది ముఖ్యమైన విషయాలను తెలుసుకోండి.దుబాయ్‌లో బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌తో సన్నిహితంగా ముడిపడి ఉంటాయి. బంగారం ధరలు ప్రతిరోజూ మారుతూ ఉంటాయి. గ్రాముకు దిర్హామ్‌లలో పేర్కొంటారు. అన్ని పేరున్న, నమ్మకమైన నగల దుకాణాలు డిజిటల్ డిస్‌ప్లేలలో తాజా బంగారం ధరలను ప్రదర్శిస్తాయి. రోజువారీ ధరలను తనిఖీ చేయడం ద్వారా మీరు బంగారం నిజమైన విలువను



సులభంగా నిర్ధారించుకోవచ్చు. అధిక ధర చెల్లించకుండా ఉండవచ్చు.దుబాయ్‌లో బంగారం కొనుగోలు చేసేటప్పుడు ఎల్లప్పుడూ లైసెన్స్ పొందిన, పేరున్న నగల వ్యాపారుల వద్దనే కొనండి. ఇది స్వచ్ఛత, ప్రామాణికత మరియు సరసమైన ధరపై పూర్తి హామీని ఇస్తుంది. డీరా గోల్డ్ సూక్, మీనా బజార్, గోల్డ్ అండ్ డైమండ్ పార్క్, ప్రధాన మాల్స్ వంటి ప్రదేశాలు అధిక నాణ్యత గల బంగారాన్ని అందిస్తాయి. ఇక్కడ లభించే చాలా బంగారం ధృవీకరించిన స్వచ్ఛతతో వస్తుంది. అందుకే మీరు ఎలాంటి చింత లేకుండా కొనుగోలు చేయవచ్చు.బంగారం స్వచ్ఛత దాని క్యారెట్‌ను బట్టి నిర్ణయిస్తారు. 24K, 22K, 21K, 18ఖ. ఈ క్యారెట్‌లను క్షుణ్ణంగా అర్థం చేసుకోండి. తద్వారా మీరు స్వచ్ఛత ఆధారంగా సరైన ధర చెల్లించి, ఎలాంటి మోసాలను అయినా నివారించవచ్చు. చాలా ఆభరణాల లోపల క్యారెట్ గుర్తు చెక్కినట్లుగా ఉంటుంది. అందుకే కొనుగోలు చేసేటప్పుడు దానిని తప్పకుండా తనిఖీ చేయండి.దుబాయ్‌లో హాల్‌మార్కింగ్‌ను దుబాయ్ సెంట్రల్ లాబొరేటరీ పర్యవేక్షిస్తుంది. దీనివల్ల బంగారం పేర్కొన్న స్వచ్ఛతకు తగినట్టుగానే ఉందని నిర్ధారిస్తుంది. అందువల్ల కొనుగోలు చేసేటప్పుడు హాల్‌మార్క్‌ను తప్పకుండా తనిఖీ చేయండి. మేకింగ్ ఛార్జ్ అనేది ముడి బంగారం ధరకు అదనంగా జోడించే రుసుము. ఈ ఛార్జ్ ఆభరణాలను తయారు చేయడానికి అవసరమైన శ్రమ, డిజైన్ మరియు పనితనాన్ని కవర్ చేస్తుంది. దుబాయ్ గోల్డ్ సౌక్‌లో, మేకింగ్ ఛార్జీలు సాధారణంగా బంగారం ధరలో 5% నుండి 8% వరకు ఉంటాయి. దాగి ఉన్న ఖర్చులను నివారించడానికి, అధికంగా చెల్లించకుండా ఉండటానికి మేకింగ్ ఛార్జ్‌ను జాగ్రత్తగా అర్థం చేసుకోండి.బంగారం కొనుగోలు చేసేటప్పుడు అమ్మకందారుని నుండి సర్టిఫికేట్, పూర్తి బిల్లును తప్పకుండా అడగండి. ఇది బంగారం స్వచ్ఛతను, బరువును నిర్ధారించి, దానిని భారతదేశానికి తిరిగి తీసుకురావడాన్ని సులభతరం చేస్తుంది. హాల్‌మార్క్‌లు బంగారం ప్రామాణికతను నిర్ధారించినప్పటికీ దుబాయ్ నుండి దిగుమతి చేసుకున్న బంగారం కోసం భారత కస్టమ్స్ అధికారులు తరచుగా కొనుగోలు ఇన్‌వాయిస్‌ను అడుగుతారు. అందువల్ల మీ వద్ద చెల్లుబాటు అయ్యే బిల్లు, సర్టిఫికేట్ ఉండటం చాలా ముఖ్యం.

## విన్‌ఫాస్ట్ మరో ఈవీ ప్రారంభ ధర రూ.24.49 లక్షలు

**న్యూఢిల్లీ,**
దేశీయ మార్కెట్లోకి మరో విదేశీ ఎలక్ట్రిక్ వాహనం అందుబాటులోకి వచ్చింది. వియత్నాంకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ విన్‌ఫాస్ట్..సరికొత్తగా ఏడుగురు కూర్చోవడానికి వీలుండే వీఎఫ్ ఎంపీవీని పరిచయం చేసింది.ఈ కారు ప్రారంభ ధర రూ.24.49 లక్షలుగా నిర్ణయించింది. సింగిల్ ఛార్జింగ్‌తో 517 కిలోమీటర్లు ప్రయాణించే ఈ కారును దేశీయ కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా తయారు చేసినట్టు కంపెనీ సీఈవో తపాన్ ఘోష్ తెలిపారు.




## బ్యాటర్ అభిషేక్ శర్మ అంటే నాకు క్రష్

### స్మృతి మంధానపై వీడియో క్రియేట్


ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీ సెలెబ్రిటీలకు శాపంగా మారింది. మంచికి వాడాల్సిన సాంకేతికతను కొందరు ఆకతాయిలు తప్పుడు పనులకు ఉపయోగిస్తున్నారు. ఏఐ సాయంతో నకిలీ ఫొటోలు, వీడియోలను సృష్టించి పలువురు ప్రముఖుల పరువును బజారున పడేస్తున్నారు. కాదేదు నకిలీకి అనర్హం అన్న రీతిలో ఏఐ టెక్నాలజీని వాడుతున్నారు. క్రీడాకారులపై డీప్ ఫేక్ ఫొటోలు, వీడియోలు రూపొందిస్తూ శునకానందం పొందుతున్నారు. పాత ఇంటర్వ్యూల వీడియోల సాయంతో అనని మాటలు అన్నట్లు మాయ చేస్తున్నారు. ఫేక్ అనే ఆలోచన కూడా రాకుండా వీడియో క్రియేట్ చేస్తున్నారు.దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కుటుంబం నుంచి విరాట్ కోహ్లీ వరకు చాలా మంది ఆటగాళ్లు ఈ నకిలీగాళ్లతో ఇబ్బంది పడ్డారు. తాజాగా భారత మహిళా జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు సంబంధించి ఓ ఫేక్ వీడియోను సృష్టించి నెట్టింట వైరల్ చేశారు. ఏ మాత్రం సందేహం రాకుండా.. నిజమేనని నమ్మేలా వీడియోను క్రియేట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో




ఇన్‌స్టాగ్రామ్‌లో హల్‌చల్ చేస్తోంది. స్మృతి మంధానకు సంబంధించి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూను కేటుగాళ్లు పూర్తిగా మార్చేసారు. ఆ ఇంటర్వ్యూలోని వాయిస్ తీసేసి ఏఐ సాయంతో కొత్త వాయిస్‌ని జోడించారు. టీమిండియా యువ ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ అంటే నాకు క్రష్ అని స్మృతి మంధాన చెప్పినట్లుగా ఈ వీడియోను క్రియేట్ చేశారు.ఈ నకిలీ వీడియోలో హోస్ట్.. టీమిండియా ఆటగాళ్లలో మీ క్రష్ ఎవరా? అని అడగ్గా.. స్మృతి మంధాన అభిషేక్ శర్మ పేరు చెప్పింది. అక్కడికే కట్ చేసి.. బీసీసీఐ అవార్డ్స్ ఫంక్షన్‌లో అభిషేక్ శర్మ, స్మృతి మంధాన ఒకరినొకరు చూసుకున్నట్లుగా వీడియోను ఎడిట్ చేశారు. ఈ వీడియో నిజమేనని నమ్మిన నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. ఏఐ టూల్స్ ద్వారా ఈ వీడియోను క్రాస్ చెక్ చేయగా ఫేక్ అని తేలింది. అసలు ఏ ఇంటర్వ్యూలో కూడా మంధాన తన క్రష్ అభిషేక్ శర్మ అని చెప్పలేదు. ఏ హోస్ట్ కూడా టీమిండియాలో మీ క్రష్ ఎవరా? అని అడగలేదు. అడగరు కూడా. ఈ లాజిక్ గుర్తించిన జనాలు ఈ వీడియో నిజమేనని నమ్ముతున్నారు. చాలా ఇంటర్వ్యూలలో స్మృతి మంధాన తన క్రష్ గురించి అడిగినప్పుడు, తనకు చిన్నప్పటి నుంచి బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ అంటే చాలా ఇష్టమని తెలిపింది. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్‌తో స్మృతి మంధాన ప్రేమాయణం నడిపింది. కానీ వీరి వివాహం పెళ్లి పీటలపై ఆగిపోయింది. ఆ తర్వాత ఈ ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. పలాష్ ముచ్చల్‌కు ఇతర మహిళలతో సంబంధాలు ఉండటంతోనే స్మృతి పక్కనపెట్టిందని అప్పట్లో వార్తలు వచ్చాయి.

## కోహ్లీని ఆశ్చర్యపరిచిన మయాంక్ యాదవ్

క్రికెట్ మైదానంలో పోటీ ఎంత తీవ్రంగా ఉన్నా, ఆటగాళ్ల మధ్య ఉండే గౌరవం ఆటకు అసలైన అందాన్ని తెస్తుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా బుధవారం రాత్రి ఎం. చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో అటువంటి ఒక అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. మ్యాచ్ ముగిసిన తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ యువ ప్లేయర్ చేసిన ఒక పని, విరాట్ కోహ్లీని సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. లక్నో సూపర్ జెయింట్స్ నిర్దేశించిన 147 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌సీబీకి విరాట్ కోహ్లీ (49 పరుగులు, 34 బంతులు) అద్భుతమైన పునాది వేశారు. తన క్లాసిక్ షాట్లతో చిన్నస్వామి స్టేడియాన్ని హోరెత్తించిన కోహ్లీ, కేవలం ఒక పరుగు దూరంలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నారు. అయితే, ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకున్న తర్వాత, మైదానంలో ఆటగాళ్లందరూ



ఒకరినొకరు అభినందించుకుంటున్న సమయంలో ఒక విశేషం జరిగింది. లక్నోకు చెందిన ఒక యువ ఫాస్ట్ బౌలర్ (వార్తల ప్రకారం మయాంక్ యాదవ్ లేదా యువ పేసర్ మయుక్ చౌదరి) విరాట్ కోహ్లీ దగ్గరికి వెళ్లి, ఆయన పట్ల ఎంతో వినయాన్ని ప్రదర్శించారు. కోహ్లీని ఒక లెజెండ్‌గా భావించే ఆ యువ బౌలర్, కోహ్లీ దగ్గరికి వచ్చి ఆయన ఆశీర్వాదం తీసుకున్నట్లుగా ప్రవర్తించడమే కాకుండా, వికెట్ల మధ్య కోహ్లీ వేగం మరియు ఫిట్‌నెస్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ హఠాత్పరిణామానికి కోహ్లీ కాసేపు ఆశ్చర్యపోయినా, వెంటనే ఆ యువ ఆటగాడిని ఆత్మీయంగా హత్తుకుని మెచ్చుకున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు విరాట్ కోహ్లీ చీలమండ గాయంతో ఇబ్బంది పడుతున్నట్లు వార్తలు వచ్చాయి. అందుకే ఆయన ఈ మ్యాచ్‌లో 'ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్'గా బరిలోకి దిగారు. ఫీల్డింగ్ చేయకపోయినా, బ్యాటింగ్ సమయంలో ఆయన క్రీజులో పరిగెత్తిన తీరు చూస్తుంటే ఎక్కడా గాయం లక్షణాలు కనిపించలేదు. ఆ యువ బౌలర్ కూడా ఇదే విషయాన్ని కోహ్లీతో చర్చిస్తూ, "మీ ఎనర్జీ లెవల్స్ చూస్తుంటే మాకే ఆశ్చర్యంగా ఉంది" అని అన్నట్లు తెలుస్తోంది. ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ బౌలర్లు రసిక్ సలాం (4/24), భువనేశ్వర్ కుమార్ (3/27) అద్భుత ప్రదర్శనతో లక్నోను 146 పరుగులకే కట్టడి చేశారు. అనంతరం కోహ్లీ 49 పరుగులతో మెరవగా, చివర్లో రజత్ పాటిదార్ (27), జితేష్ శర్మ (23) మెరుపులు మెరిపించి ఆర్‌సీబీకి సునాయాస విజయాన్ని అందించారు. కేవలం 15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు, తమ రన్ రేట్‌ను భారీగా మెరుగుపరుచుకుని టేబుల్ టాపర్‌గా నిలిచింది.

# స్పోర్ట్స్

## సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కు ధోనీ దూరం!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ లీగ్‌లో ఏకంగా 5 సార్లు ట్రోఫీ ని గెలుచుకొని..మోస్ట్ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీగా నిలిచింది. కానీ, గత రెండు సీజన్లుగా చెన్నై సూపర్ కింగ్స్ లీగ్ దశలో మ్యాచ్ గెలిచేందుకే తీవ్రంగా శ్రమిస్తోంది. కొన్ని సందర్భాల్లో పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగుభాగన ఉండి ట్రోల్స్ కు గురవుతోంది. అయితే చెన్నై గెలుపులోనూ ధోనీ ఉండగా.. ఇప్పుడు టీమ్‌లో ధోనీ లేకపోవడమే జట్టు వైఫల్యానికి ప్రధాన కారణమని ఫ్యాన్స్ అంటున్నారు. ఈ సీజన్‌లో గాయం కారణంగా రెండు వారాల పాటు దూరమైన మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. లేకపోవడం చెన్నై టీమ్ వైఫల్యానికి కారణంగా తెలుస్తోంది. దీంతో ధోనీ ఎప్పుడొస్తాడని సీఎస్కే టీమ్ సహా అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే శనివారం ఏప్రిల్ 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న మ్యాచ్‌లో ధోనీ ఆడబోతున్నాడనే వార్తలు వచ్చాయి. కానీ, ఈ మ్యాచ్‌కు కూడా ధోనీ అందుబాటులో ఉండడం లేదని సమాచారం. సీఎస్కే మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. ఏప్రిల్ 23న వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో జరిగే ఐపీఎల్ 2026 మ్యాచ్‌లో అందుబాటులో ఉంటాడని తాజా సమాచారం. పిక్క కండరాల గాయం కారణంగా ఆరంభ మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. ధోనీ లేకుండా చెన్నై ఆడిన మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 3 ఓటములతో సతమతమవుతోంది. అయితే సీఎస్కే తరువాతి మ్యాచ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఏప్రిల్ 18న జరగనుంది. అయినా కూడా ఏప్రిల్ 23న ముంబై ఇండియన్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడనున్నాడని తెలుస్తోంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం.. సీఎస్కే వర్గాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారం ధోనీ పూర్తి ఫిట్‌నెస్‌కు దగ్గరగా ఉన్నాడు. 2011 వన్డే ప్రపంచ కప్ టైటిల్‌ను భారత్‌కు అందించిన వాంఖడే మైదానంలో జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం ఉంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో ఐదు మ్యాచ్‌లలో రెండు విజయాలతో సీఎస్కే ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇటీవలే కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో మ్యాచ్‌కు ముందు, ధోనీ సీఎస్కే బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీతో కలిసి శిక్షణ తీసుకున్నాడు. కానీ, అతను మైదానంలోకి రాలేదు. అదే విధంగా స్పిన్నర్ నూర్ అహ్మద్‌తో కలిసి ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. మహేంద్ర సింగ్ ధోనీ చివరిసారిగా ఏప్రిల్ 20, 2025న వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సీఎస్కే తరఫున ఆడాడు. ఆ మ్యాచ్‌లో అతను ఆరు బంతుల్లో 4 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో ధోనీ లేకపోవడంతో.. సంజు సామ్సన్ సీఎస్కే తరఫున వికెట్ కీపర్–బ్యాటర్ గా ఉన్నాడు. ధోనీ తిరిగి వచ్చిన తర్వాత, శాంసన్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడతాడని, ధోనీ వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపడతాడని భావిస్తున్నారు. అంతేకాకుండా మాజీ సీఎస్‌కే కెప్టెన్‌ను కేవలం బ్యాటింగ్ కోసమే బరిలోకి దించే ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉపయోగించుకునే అవకాశం కూడా ఉంది.




## స్వయంభూ నుంచి రారా
# ధీవర పాట ప్రోమో విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' పాటకి సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. దీనికి సంబంధించిన ఫుల్ పాటను ఈరోజు సాయంత్రం 6.03 గంటలకు విడుదల చేయబోతున్నట్లు తెలిపింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.




## మా ఇంటి బంగారం'
# ఫస్ట్ సాంగ్ రిలీజ్!

'తస్సాదియ్య' అంటూ స్టెప్పులేసిన సమంత..

స్టార్ హీరోయిన్ సమంత రుత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. సమంత తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పై ఈ సినిమాను నిర్మిస్తుండగా.. తాజాగా ఈ చిత్రం నుండి ఫస్ట్ సింగిల్ 'తస్సాదియ్య' వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ ఈ చిత్రానికి అద్భుతమైన బాణీలు అందించగా.. 'తస్సాదియ్య' పాట ఒక ఫ్యామిలీ పార్టీ సాంగ్‌లా ఉండి, వినేవారిలో జోష్ నింపుతోంది. ఈ పాటను ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద, పుణ్య కలిసి పాడారు. సమంత తనదైన స్టెప్పులతో ఈ వీడియో సాంగ్‌లో సందడి చేశారు. 'ఓ బేబీ' వంటి హిట్ తర్వాత సమంత, దర్శకురాలు బి.వి. నందినీ రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. ఈ సినిమాలో సమంత ఒక సాధారణ ఇల్లాలుగా కనిపిస్తూనే, తన కుటుంబాన్ని కాపాడుకునే పవర్‌ఫుల్ మహిళగా కనిపించబోతున్నారు. సమంత భర్త రాజ్ నిడిమోరు ఈ సినిమాకు కథను అందిస్తున్నాడు.




## రుక్మిణి వసంత్‌కు తమిళంలో
# బంపరాఫర్

కాంతార-2' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపును దక్కించుకుంది కన్నడ భామ రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఈ సొగసరి భారీ ఆఫర్లతో బిజీగా ఉంది. ఇప్పటికే తెలుగులో ఎన్టీఆర్ 'డ్రాగన్', కన్నడంలో యశ్ 'టాక్సిక్'లో కథానాయికగా నటిస్తున్న ఆమె తాజాగా తమిళంలో అగ్ర హీరో ధనుష్ సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ధనుష్ తన 57వ చిత్రాన్ని తమిళరస పద్యముత్తు దర్శకత్వంలో చేయబోతున్నారు. ఇందులో కథానాయికగా రుక్మిణి వసంత్‌ను ఖరారు చేశారు. తమిళంలో ఏస్, మదరాసి చిత్రాలు ఆమెను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో కోలీవుడ్‌లో మంచి బ్రేక్‌నిచ్చే సినిమా కోసం ఎదురుచూస్తున్నదీ భామ. తాజా ఆఫర్‌తో తమిళంలో రుక్మిణి కెరీర్ మలుపు తిరగడం ఖాయమంటున్నారు.




## సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ..
## 'ఏక్ దిన్' ట్రైలర్ అదిరిపోయింది!




స్టార్ బ్యూటీ సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'ఏక్ దిన్'. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమా మే 01న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హీరోయిన్ (సాయి పల్లవి) ఇందులో ఒక అరుదైన వ్యాధితో బాధపడుతుంటుంది. అయితే తనను ప్రేమించిన హీరో (జునైద్) అమెతో ఒక్కరోజు అయిన ప్రేమతో గడపాలని కోరుకుంటాడు. అయితే ఆ ఒక్క రోజు వారి జీవితాలను ఎలా మార్చేసింది అనేది కథాంశం. తెలుగులో ఈ చిత్రం ఒక రోజు అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా.. అమీర్ ఖాన్, మన్సూర్ ఖాన్, అపర్ణ పురోహిత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రామ్ సంపత్ సంగీతం అందిస్తున్నాడు. సాయి పల్లవి హిందీలో నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి.

## ఆకట్టుకుంటున్న మోహన్
# లాల్ కొత్త సినిమా లుక్!

అయ్యప్ప భక్తుల మధ్యలో పోలీస్ ఆఫీసర్..



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ వరుస ప్రయోగాలతో బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగిస్తున్నారు. గతేడాది 'తుడరుమ్' చిత్రంలో ట్యాక్సీ డ్రైవర్‌గా, 'హృదయపూర్వం'లో ప్రేమికుడిగా వైవిధ్యమైన నటనతో మెప్పించిన ఆయన, ఇప్పుడు ఖాకీ చొక్కా ధరించి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తరుణ్ మూర్తి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ చిత్రానికి 'అతిమనోహరం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 'తుడరుమ్' వంటి విజయవంతమైన సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మలయాళీల నుతన సంవత్సర పండుగ అయిన 'విషు' రోజున ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తూ చిత్ర బృందం అధికారిక ప్రకటన చేసింది. ఈ పోస్టర్‌లో శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వామి భక్తుల మధ్య మోహన్ లాల్ పోలీస్ యూనిఫాంలో గంభీరంగా కనిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఇందులో ఆయన 'లవ్ లాజన్' అనే విభిన్నమైన పాత్రను పోషిస్తుండటం విశేషం. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాతో పాటు మోహన్ లాల్ చేతిలో 'పేట్రియాట్', అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'దృశ్యం 3' వంటి క్రేజీ ప్రాజెక్టులు కూడా ఉండటంతో మాలీవుడ్ వర్గాల్లో సందడి నెలకొంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365